'కమిటీల పేరుతో కాలయాపన'


ఇల్లెందులో నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, రాజేందర్ తదితరులు

'రైతు భరోసా' అమలుకు జులైలోనే మంత్రుల కమిటీ వేశారు. పదిహేను రోజుల్లో నివేదిక వస్తుందన్నారు. ఇప్పుడు మళ్లీ కమిటీల పేరిట ప్రభుత్వం కాలయాపన చేస్తోంది' అని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ఆరోపించారు. రైతు భరోసా జాప్యంపై భారాస ఆధ్వర్యంలో ఇల్లెందు పట్టణంపాతబస్టాండ్ వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. హరిప్రియ మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దిండిగల రాజేందర్, సిలివేరి సత్యనారాయణ, దేవీలాల్ నాయక్, జేకే శ్రీను, బావ్ సింగ్, రమేశ్, రేణుక, రవి, శివ, గాజి పాల్గొన్నారు.


- ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

భరోసా.. రభస

రైతులకు వానాకాలం అందాల్సిన పెట్టుబడి సాయం.. రూ.568 కోట్లు

రైతులకు పెట్టుబడి 'భరోసా' ఎక్కడని ప్రతిపక్షాలు రోడ్డెక్కాయి. 'రైతు భరోసా' పథకంపై ప్రభుత్వ వైఖరేమిటో చెప్పాలని ఆందోళన చేస్తున్నాయి. వాస్తవానికి ఈ వానాకాలం పెట్టుబడి సాయంగా ఉమ్మడి జిల్లా రైతులకు రూ.568 కోట్లు అందాల్సి ఉందని అంచనా. ఈ అంశంపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం తుది నిర్ణయం అనంతరం, ఈ యాసంగి నుంచే హామీని నిలబెట్టుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తాజాగా వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో పరిస్థితిని పరిశీలిస్తే..

- ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే



'రైతుబంధు' పథకాన్ని గత ప్రభుత్వం 2018, మే నెల 10న ప్రారంభించింది. తొలి ఏడాది ఎకరాకు రూ.4 వేల చొప్పున రెండు సీజన్లకు రూ.8 వేల పెట్టుబడి సాయాన్ని విడుదల చేశారు. 2019, వానాకాలం సీజన్ నుంచి ఎకరాకు రూ.5 వేల చొప్పున ఏడాదికి మొత్తం రూ.10 వేలకు సాయం పెంచారు. ఆ తర్వాత అదే మొత్తాన్ని వర్తింపజేస్తూ వచ్చారు. మొత్తం 12 సీజన్లకు పెట్టుబడి సాయం అందింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 'రైతుబంధు' స్థానంలో 'రైతు భరోసా' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఎకరాకు ఒక సీజన్‌కు రూ.7,500 చొప్పున, రెండు సీజన్లకు రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామన్నది ఎన్నికల హామీ. విధివిధానాల ఖరారుకు మంత్రి వర్గ ఉప సంఘాన్ని నియమించింది. ఇంకా నిర్ణయాలు ఖరారు కావాల్సి ఉంది. ఈ లోపు వానాకాలం సీజన్ పూర్తికావస్తోంది. యాసంగి సీజన్‌కైనా సాయం అందేనా? అని రైతులు నిరీక్షిస్తున్నారు. దీనిపై తాజాగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టత ఇచ్చారు. రెండో సీజన్‌లో రైతుల ఖాతాకు నగదు అందజేస్తామని చెబుతున్నారు.

ఈ సీజన్‌లో అంచనా ఇలా...

జిల్లా	రైతుల సంఖ్య	అందాల్సిన సాయం (రూ.కోట్లలో)..
ఖమ్మం	3,29,892	362.94
భద్రాద్రి	1,34,192	205.15

రుణమాఫీ.. ఆపై అననుకూల వాతావరణం

ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేస్తామని ప్రకటించింది. పలు నిబంధనల వల్ల పూర్తిస్థాయిలో రుణ మాఫీ కాకపోవటంతో రైతులు చాలా మంది ఆందోళన చెందుతున్నారు. ఇదే క్రమంలో వారికి 'రైతు భరోసా' సాయం కూడా అందక నిరాశ వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఈ సీజన్ అంతగా ఆశాజనకంగా లేదు. ఆదిలోనే భారీ వర్షాలు, వరదలు, ప్రతికూల వాతావరణంతో ప్రధాన పంటలైన పత్తి, వరి, మిరప పైర్లు దెబ్బతిన్నాయి. ఉమ్మడి జిల్లాల్లో వేలాది ఎకరాల్లో పెట్టుబడులూ అందే పరిస్థితి లేదు.

● 'రైతు భరోసాపై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. త్వరలో పెటుబడి సాయం విడుదల అవుతుంది' అని ఖమ్మం జిల్లా డీఏఓ పుల్లయ్య 'న్యూస్‌టుడే'తో అన్నారు.

రైతులు → / అందిన మొత్తం (రూ.కోట్లలో) →

సంవత్సరం	వానాకాలం: రైతులు	వానాకాలం: అందిన మొత్తం	యాసంగి: రైతులు	యాసంగి: అందిన మొత్తం
2018-19	1,10,299	135.59	1,02,490	130.38
2019-20	1,08,392	143.81	82,248	91.68
2020-21	1,30,519	201.77	1,33,348	204.71
2021-22	1,33,711	204.45	1,33,192	205.15
2022-23	1,33,811	204.75	1,30,520	201.75
2023-24	1,34,420	206.65	1,30,275	201.10

నిఘా నేత్రాలకు మసక

కొత్తగూడెం పట్టణం, పాల్వంచ గ్రామీణం, ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

'ఒక్క సీసీ (క్లోజ్డ్ సర్క్యూట్) కెమెరా వంద మంది కానిస్టేబుళ్లతో సమానం'.. తరచూ సదస్సులు, సమావేశాల్లో పోలీసు అధికారులు చెప్పేమాట ఇది. కానీ, చాలాచోట్ల నిఘా నేత్రాలు మసకబారుతున్నాయి. ముఖ్యంగా పట్టణాల్లోని కూడళ్లలో. భారీ వర్షాలతో పాటు వానరాల చేష్టలతో పలుచోట్ల సీసీ కెమెరాలు దెబ్బతిన్నాయి. కేబుల్స్ వ్యవస్థ పనిచేయకుండా పోయింది. వాటిని పర్యవేక్షించే వ్యవస్థ సైతం సరిగా లేదు. ఫలితంగా నేర పరిశోధన, ఆధారాల సేకరణకు కూడా వీల్లేకుండా పోతోంది. ఓ వైపు కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలియజెప్పే అధికారులు.. ఇప్పుడు అందుబాటులో ఉన్న వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని ప్రధానమైన కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు పురపాలకాల్లో 'ఈనాడు-పరిశీలన' చేపట్టింది. అక్కడి పరిస్థితులు ఇలా ఉన్నాయి.

ఇల్లెందు పట్టణంలో..

ఇక్కడ మొత్తం 72 సీసీ కెమెరాలున్నాయి. చెరువుకట్ట ఏరియా, గోవింద్ సెంటర్, కొత్త బస్టాండ్, బుగ్గవాగు, పాత బస్టాండ్, జగదాంబ సెంటర్, సుభాష్‌నగర్ సహా అన్ని ప్రధాన కూళ్లలో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం పలు చోట్ల బాగానే పనిచేస్తున్నాయని అంచనా వేస్తున్నా.. ఇటీవల వర్షాల కారణంగా కేబుల్స్ దెబ్బతిన డంతో 20కి పైగా మరమ్మతులకు గురైనట్లు పరిశీలనలో తేలింది. కాలనీలు, వ్యాపార సముదాయాల్లో నిఘా నేత్రాల ఏర్పాటు ఆవశ్యకతపై సీఐ సత్యనారాయణ 'మేముసైతం'లో భాగంగా అవగాహన కల్పిస్తున్నారు.

కొత్తగూడెంలో..

జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో నిఘా నేత్రాలు కీలకంగా మారాయి. ఒకటో పట్టణ ఠాణా పరిధిలో 38కి గాను 8, రెండో పట్టణ ఠాణా పరిధిలో 23కి 6, మూడో పట్టణ ఠాణా పరిధిలో 64కి గాను 21 వరకు పనిచేయడం లేదు.


పోస్టాఫీస్ కూడలిలో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు

పాల్వంచలో..

ప్రధాన వీధులు, కూడళ్లలో దాదాపు 60 వరకు సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో సుమారు 24 మాత్రమే పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి. మిగతా చోట్ల సాంకేతిక కారణాలు, వర్షాల కారణంగా మరమ్మతులకు గురయ్యాయి. వాటికి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని పాల్వంచ పట్టణ పోలీసు అధికారులు పేర్కొన్నారు.


'గూడెం' బస్టాండులో పనిచేయని నిఘా నేత్రం

నిత్యం రద్దీగా ఉండే కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన నాలుగింటిలో కేవలం రెండు సీసీ కెమెరాలే సరిగా పనిచేస్తున్నాయి. పోలీసు శాఖ స్వయంగా ఏర్పాటు చేసిన వాటిల్లో పలు నిఘా నేత్రాలు సాంకేతిక సమస్యలు, కేబుల్ వ్యవస్థ దెబ్బతిని సరిగా పనిచేయడం లేదు. వీటికి సత్వరం మరమ్మతులు చేయకపోతే నేర పరిశోధనకూ ఆటంకాలుగా తప్పేలా లేవు. ఈ నేపథ్యంలో కొత్తగూడెం పట్టణం పోలీసులు యోచిస్తున్నట్లు సీసీ కెమెరాల వ్యవస్థ నిర్వహణను ఏదైనా ఏజెన్సీకి అప్పగించడం శ్రేయస్కరమనే అభిప్రాయం పురవాసుల్లో వ్యక్తమవుతోంది.

కొత్తగూడెం పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు, మరమ్మతుల నిర్వహణకు సంబంధించి నిధులు కేటాయించాలని పురపాలక కమిషనర్‌ను ఇటీవల కోరాం. దీంతో వారు స్పందించి రూ.6 లక్షల నిధులు కేటాయిస్తామని చెప్పారు. దీంతో పాటు నిఘా నేత్రాల నిర్వహణ బాధ్యతలను గుర్తింపు పొందిన అధీకృత ఏజెన్సీకి అప్పగించాలనే యోచనలో ఉన్నాం. తద్వారా అవి నిరంతరం పనిచేసేలా చూస్తాం. 'మేముసైతం' కార్యక్రమంలో ప్రజా భాగస్వామ్యాన్ని సైతం కోరుతున్నాం. దుకాణ సముదాయాలు, కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే భద్రత ఉంటుందనేది మా సూచన.

- షేక్ అబ్దుల్ రెహ్మాన్, కొత్తగూడెం డీఎస్పీ

నేటి నుంచి సంగ్రహణాత్మక పరీక్షలు ప్రారంభం

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

జిల్లాలోని 1-10వ తరగతి విద్యార్థులకు సంగ్రహణాత్మక మూల్యాంకనం (ఎస్ఏ-1) పరీక్షలు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. జిల్లా పరీక్షల బోర్డు (డీసీఈబీ) అధికారులు ఈ నెల 14వ తేదీన షెడ్యూలును విడుదల చేసిన విషయం తెలిసిందే. సంబంధిత ప్రశ్నపత్రాలను జిల్లా కేంద్రం నుంచి మండలాలు, అక్కడ్నుంచి పాఠశాలలకు ఇప్పటికే చేరుకున్నాయి. ప్రభుత్వ, జిల్లా పరిషత్, కస్తూర్బాగాంధీ బాలికా, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాలతో పాటు ప్రైవేటు విద్యాలయాల్లో ఎస్ఏ-1 పరీక్షలు 21న మొదలై 28వ తేదీ వరకు జరుగుతాయి. గతేడాది ఆరు పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడాది సైన్స్‌లో రెండు పేపర్లు ప్రవేశపెట్టారు. 7, 9వ తరగతుల వారికి మ.1.15- సా.4 గంటల మధ్య, మిగతా వారందరికీ ఉ.9.15 నుంచి మ.12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయి.

తరగతుల వారీగా విద్యార్థులు

తరగతి	విద్యార్థులు
1	6,470
2	7,785
3	8,245
4	9,095
5	7,215
6	15,485
7	15,430
8	14,755
9	13,350
10	2,430



డీఈవో ఆదేశాలతో పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు ప్రభుత్వం అందజేసే ప్రశ్నపత్రాలతో నిర్వహించేలా అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ఆదేశాలిచ్చాం. నవంబరు 2న ఫలితాలు వెల్లడించి 16వ తేదీన తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించేలా చూస్తాం.

- సాదనపల్లి మాధవరావు, డీసీఈబీ కార్యదర్శి

'స్వచ్ఛ' స్ఫూర్తికి సెలవు!



జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో 'స్వచ్ఛ పట్టణ' స్ఫూర్తికి కొందరు వ్యాపారులు తూట్లు పొడుస్తున్నారు. పట్టణంలోని చిన్నబజార్, పెద్దబజార్, ఎంజీ రోడ్డు దుకాణాల సముదాయాలు వ్యాపారాలతో నిత్యం రద్దీగా కనిపిస్తాయి. వారాంతం ఆదివారమైతే చాలు.. ఆ వారమంతా దుకాణాల్లో పోగైన చెత్తనంతా ఇలా నడి వీధిలో పడేస్తుండటం గమనార్హం. సెలవు దినాన వాణిజ్య కూడళ్లు, రోడ్లు ఖాళీ అట్టపెటెలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో పోగుపడి ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. కనీసం సమీప డబ్బాల్లోనైనా వ్యర్థాలను పడేసేలా పురపాలక అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే

పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తుల పూజలు


అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: జగన్నాథపురం, కేశవాపురం గ్రామాల మధ్య వేంచేసి ఉన్న పెద్దమ్మతల్లి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. పరిసర గ్రామాలతో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. తమను చల్లగా చూడాలని వేడుకుంటూ బోనాలు సమర్పించారు. అన్నప్రాసన, వాహనపూజలు, తలనీలాలు, అమ్మవారికి ఒడిబియ్యం, చీరలు నింపుట కార్యక్రమాలు అర్చకులు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.రజనీకుమారి, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

ఒత్తిడిని జయిస్తేనే సమస్యలకు పరిష్కారం

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: సమస్యల్లో ఉన్నప్పుడు ఒత్తిడికి గురైతే మనసు చలిస్తుందని, ఆ సమయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకునే అవకాశాలుంటాయని వ్యక్తిత్వ వికాస నిపుణులు జువ్వాది వెంకటేశ్వరబాబు అన్నారు. 'వృత్తి, వ్యక్తిగత జీవితంలో ఒత్తిడిని అధిగమించడం'పై కొత్తగూడెం సబ్‌డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బందికి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ప్రేరణ సదస్సును ఆదివారం నిర్వహించారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా పరిష్కార మార్గాలపై దృష్టిపెట్టాలన్నారు. సన్నిహితులు, అర్థం చేసుకునే వారితో బాధలను పంచుకుంటే ఉపశమనం, పరిష్కారం లభిస్తాయన్నారు. వృత్తి, కుటుంబ, సమాజపరంగా జీవితాన్ని సమన్వయం చేసుకోవాలని సూచించారు. శారీరక, మానసిక దృఢత్వానికి వ్యాయామం చేయాలన్నారు. మద్యం వంటి వ్యసనాల బారినపడితే తీవ్రంగా నష్టపోతారన్నారు. ఏం చేసినా అది కుటుంబ సభ్యులపై ప్రభావం చూపుతుందనే అంశాన్ని మరవొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ బి.రోహిత్ రాజు, డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహ్మాన్, సబ్ డివిజన్ సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఇంపాక్ట్ క్లబ్' కరప్రతాలను అధికారులు విడుదల చేశారు.




మాట్లాడుతున్న జువ్వాది వెంకటేశ్వరబాబు, పక్కన ఎస్పీ బి.రోహిత్‌రాజు, డీఎస్పీ అబ్దుల్ రెహ్మాన్, పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది..

24 నుంచి ధ్రువీకరణ పత్రాల తనిఖీ

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణి ఉద్యోగ ఫలితాలు ఈ నెల 18న విడుదలైన నేపథ్యంలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 24 నుంచి తనిఖీ చేయనున్నారు. 24, 25 తేదీల్లో మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్), 26న మేనేజ్‌మెంట్‌ట్రైనీ పర్సనల్, 28న మేనేజ్‌మెంట్ ట్రైనీ సివిల్, సబ్‌ఓవర్‌సీస్ ట్రైనీ, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఐఈ) అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేస్తారు. 29న జనరల్ డ్యూటీ మెడికల్ అధికారులు, మేనేజ్‌మెంట్ ట్రైనీ హైడ్రోజియాలజిస్టు, జూనియర్ ఎస్టేట్స్ అధికారులు, జూనియర్ ఫారెస్టు అధికారుల పోస్టుల అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించనున్నారు.

జనవరి కల్లా.. జలకాలాట!

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

ఇల్లెందు పట్టణ వాసులకు వచ్చే జనవరి కల్లా కొత్తగా ఈత కొలను అందుబాటులోకి రానుంది. చాలామంది చిన్నారులు పట్టణ సమీపంలోని వాగులు, చెరువుల్లో ఈత సాధనకు వెళ్లి ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారు. మరో వైపు పట్టణంలో అధునాతన క్రీడా సదుపాయాలు అందని ద్రాక్షగా మారాయి. ప్రస్తుతం సింగరేణి ఆధ్వర్యంలో సైసీవో క్లబ్‌లో మాత్రమే ఈతకొలను అందుబాటులో ఉంది. ఇక్కడకు కేవలం సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులను మాత్రమే అనుమతిస్తున్నారు. ఈ నేపథ్యంలో పురపాలక సంఘం చొరవచూపి పట్టణ ప్రజల కోసం ఈత కొలను నిర్మిస్తోంది.


పార్కులో కొలను నిర్మాణానికి తవ్వుతున్న గుంత

ఎక్కడ?

ఇల్లెందు చెరువుకట్ట వద్దనున్న పార్కులో జిల్లా మినరల్ ఫండ్(టీ) నిధులు రూ.కోటితో స్విమ్మింగ్ పూల్ నిర్మించాలని పురపాలకం నిర్ణయించింది. ఈ పనులకు గత నెలలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. ఆ వెంటనే సివిల్ పనులను చేపట్టారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ వారికి నిర్మాణ బాధ్యత అప్పగించారు. కొలను, రహదారి, స్త్రీ, పురుషులకు వేర్వేరు స్నానపు గదులు, మరుగుదొడ్లు, షవర్లు నిర్మించనున్నారు.

☆ 'ఈత కొలనును 36 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నాం స్త్రీ, పురుషులు, చిన్నారులు వేర్వేరుగా వినియోగించేకునేలా ఏర్పాట్లు ఉంటాయి. వచ్చే ఏడాది జనవరికల్లా అందుబాటులోకి వచ్చేలా పనులు పర్యవేక్షిస్తున్నాం' అని పీఆర్ ఈఈ ఎస్.శ్రీనివాస్ చెప్పారు.

☆ 'పట్టణ వాసుల ఈత సాధన, విహారం కోసం అధునాతన వసతులతో ఈత కొలను నిర్మిస్తున్నాం. ఈత నేర్చుకోవాలనే సరదా ఉన్న పెద్దలు, చిన్నారులు ఈ వసతిని సద్వినియోగం చేసుకునేలా పురపాలకం తరఫున అన్ని ఏర్పాట్లు పూర్తిచేయిస్తాం. పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షిస్తున్నాం' అని ఛైర్మన్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు.

రాష్ట్రస్థాయి సమ్మేళనానికి తరలిన ఏఈవోలు

కొత్తగూడెం వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ శాఖలో ఉన్నతాధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు మధ్య 20 రోజులుగా డిజిటల్ పంట సర్వే విషయంలో తీవ్ర అగాథం ఏర్పడింది. ఈ నేపథ్యంలో మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలో ఆదివారం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఏఈవోల సమ్మేళనానికి భద్రాద్రి జిల్లా నుంచి 30 మంది ఏఈవోలు వెళ్లినట్లు సంఘం గౌరవాధ్యక్షుడు నరసింహారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ క్రాప్ సర్వేతో పాటు ఏఈవోలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఈ సమ్మేళనంలో చర్చించనున్నట్లు తెలిపారు.


సమ్మేళనానికి వెళ్తూ నినాదాలు చేస్తున్న ఏఈవోలు

నూతన రెవెన్యూ చట్టంతో న్యాయం

ఖమ్మం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టనున్న రెవెన్యూ చట్టం భూమాతతో ప్రజలకు, 70 లక్షల మంది రైతులకు న్యాయం జరుగుతుందని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం(టీవీఆర్వోడబ్ల్యూఏ) రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు అన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల చొరవతో పూర్వ వీఆర్వోలకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. ఖమ్మం నగరంలో 'గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థ, వీఆర్వోల పాత్ర' అనే అంశంపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను ఆదివారం నిర్వహించారు. ఉపేంద్రరావు మాట్లాడుతూ ప్రతి 2 వేల జనాభాకు ఒక సహాయకుడు, 16 వేల క్లస్టర్లలో ప్రతీ క్లస్టర్‌కు ఒక ఉద్యోగిని నియమించేందుకు ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుందన్నారు. సున్నం రామారావు, ప్రసాద్, రామారావు, జిల్లా నాయకులు స్వామిదాసు, నాగేంద్రబాబు, సుభాని, లక్ష్మీనర్సు, కృష్ణ, యల్లమంద, వరలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

అమ్మ స్ఫూర్తితో సింగరేణి కొలువు


కుంచపు భార్గవి

ఆ యువతిది సాధారణ మధ్యతరగతి కుటుంబం. చిన్నప్పుడే తండ్రి మరణించడంతో కష్టాలు ఆమె కుటుంబాన్ని వెతుక్కుంటూ వచ్చాయి. కానీ ఎన్ని కష్టాలు ఎదురైనా తన ఏకైక కూతురిని ఉన్నత స్థానంలో చూడాలని ఆ తల్లి కన్న కలలు, అనుభవించిన కష్టాలు అన్నీ నేడు ఫలించాయి. సింగరేణిలో అండర్ మేనేజర్ ఉద్యోగం సాధించిన తన కూతురి రూపంలో సంతోషం వారి కుటుంబంలో అడుగు పెట్టింది. మణుగూరులోని గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన కుంచపు పద్మ, రాజేందర్ దంపతుల కూతురు భార్గవి తన చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయారు. దీంతో కుటుంబాన్ని పోషిస్తూ తన చదువుకోసం తల్లి పడుతున్న కష్టాన్ని గమనించిన భార్గవి చదువులో ఉత్తమ ప్రతిభ చూపుతూ వచ్చారు. స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి వరకు చదివి 90 శాతం మార్కులు సాధించిన అనంతరం ఇంటర్‌లో 93.2 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. అనంతరం కొత్తగూడెంలోని కేఎస్ఎం మైనింగ్ కళాశాలలో బీటెక్ మైనింగ్ పూర్తి చేసి 8.56 జీపీఏ కైవసం చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది జులైలో వెలువడిన సింగరేణి ఎక్స్‌టర్నల్ మైనింగ్ అధికారుల ఉద్యోగాలకు దరఖాస్తు చేసి పరీక్ష రాశారు. అందుకు సంబంధించిన ఫలితాలు గత శనివారం విడుదల కాగా భార్గవి ఈ 2 గ్రేడ్ ఎక్స్‌టర్నల్ మేనేజ్‌మెంట్ ట్రైనీ ఉద్యోగానికి అర్హత సాధించారు. మరికొద్ది రోజుల్లో ఆమె బొగ్గు గనుల్లో అధికారిగా ప్రవేశించనున్నారు. బొగ్గు గనుల్లో మగవారికి ధీటుగా మహిళల పరంగా సత్తా చాటేందుకు సిద్ధమైన భార్గవిని పలువురు సింగరేణి అధికారులతోపాటు సింగరేణి సేవా సమితి సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

– మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

చదరంగంలో పదపదా!

◆ మంచి రేటింగ్‌తో దూసుకెళ్తున్న బాలికలు


శ్రీకళ


పల్లవి


హర్షిత


సుధాశ్రీ


దివ్య


క్రీడారంగంలో అన్ని ఆటలపై ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రభుత్వ శిక్షణ, నియంత్రణ ఉంటాయి. చదరంగం ఇందుకు పూర్తిగా భిన్నమైన వ్యవస్థ. ప్రతిభ గల క్రీడాకారులు ఎప్పటికప్పుడు తమ అంతర్జాతీయ రేటింగ్‌లను మెరుగుపర్చుకునే పోటీల్లో పాల్గొంటుంటారు. వారు ఏదైనా అంతర్జాతీయ స్థాయికి వచ్చే వరకు వారి గురించిన సమాచారం బయట ప్రపంచానికి తెలియకుండా ఎదుగుతున్నారు. ఖమ్మం జిల్లాలోనూ అంతర్జాతీయ రేటింగ్ మెరుగుపర్చుకుంటున్న క్రీడాకారులు ఉన్నారు. వారు ఆదివారం ఖమ్మం నగరంలో నిర్వహించిన పాఠశాల క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చారు. నేలకొండపల్లికి చెందిన జంగం శ్రీకళ పదో తరగతి విద్యార్థిని. ఈమె గత ఏడాది చెన్నైలో జరిగిన జాతీయ స్కూల్ గేమ్స్ చెస్ పోటీలో పాల్గొంది. జిల్లా పోటీల నుంచి తిరిగి రంగంలోకి దిగింది. 1400 రేటింగ్‌లో కొనసాగుతోంది. ఎర్రుపాలేనికి చెందిన బి.పల్లవి 1403, అడవిమల్లెల గ్రామానికి చెందిన జి.హర్షిత 1435, పి.సుధశ్రీ గత ఏడాది జాతీయ పోటీల్లో పాల్గొని 1434 రేటింగ్, ఖమ్మం అంబేడ్కర్ కళాశాలకు చెందిన దర్శి దివ్య 1570 రేటింగ్‌తో అండర్ 14, 17, 19 విభాగాల్లో రాణిస్తున్నారు. వీరు చదరంగంలో ఉన్నత స్థానమే లక్ష్యంగా మహబూబాబాద్ సాంఘిక సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన చదరంగం అకాడమీలో ప్రత్యేక శిక్షణలో కొనసాగుతున్నారు. చదరంగ సమాఖ్య పోటీలు, అందులో ప్రతిభను బట్టి రేటింగ్ ఇచ్చే పద్ధతి ఉంది. ఆ జాబితాలో ఈ బాలికలు ఉండటం గమనార్హం.

– ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

భళా.. చిత్రకళ..

◆ పెన్సిల్‌తో బొమ్మలు గీస్తున్న యువకుడు

ముదిగొండ, న్యూస్‌టుడే


అఖిల్ గీసిన కథానాయికలు, చేగువేరా చిత్రాలు


నెహ్రూ చిత్రాన్ని గీస్తున్న అఖిల్



ఆ యువకుడు పెన్సిల్ పడితే అద్భుతాలు ప్రాణం పోసుకుంటాయి. తన మదిలో మెదిలే ఆలోచనలకు పెన్సిల్‌తో జీవం పోస్తున్నారు. పాఠశాల దశలో మొగ్గ తొడిగిన ఆసక్తితో మొదలైన చిత్రకళా ప్రయాణం నేడు ఎందరినో ఆకట్టుకుట్టుకునేలా ఎదిగింది.

ముదిగొండకు చెందిన మాణిక్యం అఖిల్‌కు చిన్నప్పటి నుంచి బొమ్మలు వేయడం సరదా. ఖాళీ సమయాల్లో వివిధ ఆకృతులు గీయడం సాధన చేసేవారు. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన ఇతను పెన్సిల్‌తో బొమ్మలు వేయడంలో పట్టు సాధించారు. ఎవరి సలహా, పర్యవేక్షణ లేకుండా నైపుణ్యం సాధించారు. పల్లె సోయగాలు, ప్రముఖుల చిత్రాలు, జాతీయ, రాజకీయ నాయకుల, సినిమా హీరో హీరోయిన్ల రూపాలు.. ఇలా ఇప్పటి వరకు 2వేలకు పైగా చిత్రాలు గీశారు.

★ ఎవరైనా తన ఎదుట కూర్చుంటే వారి రూపాన్ని అచ్చుగుద్దినట్టు గీయగలరు. అంతర్జాలంలో చూసి చిత్రకళ నేర్చుకున్నారు. ★ పాప్ ఆర్ట్, స్ట్రింగ్‌ఆర్ట్‌లో రాణిస్తున్నారు. ఇసుక, ముగ్గు, దారాల సాయంతో ఇతను వేసిన బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. ★ వివాహాలు, ఇతర వేడుకల సమయంలో ఆ కుటుంబ సభ్యులంతా కలిసి ఉన్న చిత్రాలు గీస్తూ ఆదాయాన్ని పొందుతున్నారు. పెయింటింగ్‌నూ జీవన భృతిగా మార్చుకున్నారు. ★ ఆన్‌లైన్ వేదికగా జరిగే పోటీల్లో పాల్గొని పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. 2020-24 మధ్య కాలంలో పలు వెండి పతకాలు సొంతమయ్యాయి.

పక్షి గూడు.. జొన్న కూడు



ఖాళీ కొబ్బరి బొండాన్ని పక్షి గూడుగా మలిచి, జొన్నలను ఆహారంగా ఏర్పాటు చేసిన ఓ పక్షి ప్రేమికుడి ఆలోచనను పురవాసులు మెచ్చుకుంటున్నారు. కొత్తగూడెం రైటర్ బస్తీలోని సబ్‌స్టేషన్ వద్ద మొక్కల రాజశేఖర్ ఏర్పాటు చేసిన ఈ పక్షి గూడు అటుగా వెళ్లేవారిని ఆకట్టుకుంటోంది.

– కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

జబ్బుల దెబ్బకు కుంగిన జీవితాలు..


నాగమ్మకు అన్నం తినిపిస్తున్న నాగేశ్వరరావు, పక్కన కుమారుడు వెంకటేశ్వర్లు


మిరప చేలో కూలిపని చేస్తున్న నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు

రెక్కాడితేకానీ డొక్కాడని నిరుపేద కుటుంబం వారిది. రోజువారీ కూలీ పనులకు వెళ్తే తప్ప బతుకు బండి నడవలేని పరిస్థితి. అయినా ఉన్నంతలో సంతోషంగా జీవిస్తున్న ఆ కుటుంబాన్ని అనారోగ్య సమస్యలు కోలుకోలేని దెబ్బతీశాయి. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం ముత్తారం గ్రామానికి చెందిన ఎల్.నాగేశ్వరరావు, నాగమ్మ దంపతుల కుమారుడు వెంకటేశ్వర్లు. పుట్టుకతోనే దివ్యాంగుడు. పదో తరగతి వరకు చదువుకున్న అతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. నాగమ్మ ఏడేళ్ల క్రితం పక్షవాతం బారినపడటంతో చికిత్స కోసం రూ.2లక్షలు ఖర్చు చేశారు. అయినా కోలుకోని ఆమె మంచానికే పరిమితమైంది. దెబ్బమీద దెబ్బలా రెండేళ్ల క్రితం వెంకటేశ్వర్లు భార్య నాగమణికి క్యాన్సర్ సోకటంతో ఆసుపత్రుల చుట్టూ తిప్పారు. వైద్య ఖర్చుల కోసం రూ.4లక్షలు ఖర్చు చేశారు. ఎన్ని వ్యయప్రయాలకోర్చినా ఫలితం లేకపోయింది. ఆరు నెలలు క్రితం నాగమణి మరణించింది. మంచానికే పరిమితమైన నాగమ్మకు భర్త, కుమారుడే సపర్యలు చేస్తున్నారు. దివ్యాంగుడైన వెంకటేశ్వర్లు పిల్లల బాగోగులు చూసుకోవటంతోపాటు కూలీపనికి వెళ్తున్నాడు. తండ్రి వృద్ధాప్య బారి నపడటంతో నిత్యం పనికి వెళ్లలేకపోతున్నాడని, తల్లి మందులకు రూ.4 వేలు ఖర్చవుతున్నాయని వాపోతున్నారు. తనకు వచ్చే పింఛన్‌తోపాటు కూలీపనులకు వెళితే వచ్చే సంపాదనతో కుటుంబం గడుస్తోందని తెలిపారు. తండ్రికి పింఛన్ మంజూరు చేయటంతోపాటు దివ్యాంగుడైన తనకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వేడుకుంటున్నారు.

– ఈనాడు, ఖమ్మం, న్యూస్‌టుడే, ముదిగొండ

పాఠశాల క్రీడా జట్లు సిద్ధం

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడల్లో పాల్గొనే ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్లను ఆదివారం ఖమ్మం పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. జిల్లా జట్లకు ఎంపికైన వారి వివరాలను కార్యదర్శి నర్సింహమూర్తి ప్రకటించారు. అండర్-17 బాలుర జట్టులో జయంతు, సూర్య, తమన్, చరణ్, గౌతమ్, జాన్, సాయి కౌశిక్, సాత్విక్, హతీష్, గౌస్, అస్లం, విఘ్నేష్ ఉన్నారు. బాలికల జట్టులో రిమ్‌షా, అఖిల, జ్యోతిష, హనోయ్, ఆయిషని, శీతల్, చందన, కారుణ్య, చరిత, దీక్షిత, రష్మి, దర్శిని ఉన్నారు. అండర్-14 బాలుర బాస్కెట్‌బాల్ జట్టులో ఆబిద్, వినయ్, సిద్దు, చేతన్, అయాన్, స్నేహిత్, ఖాదర్, హర్షవర్ధన్, వెంకటచైతన్య, చరణ్‌సాయి, లోహిత్ ఉన్నారు. బాలికల జట్టులో అవంతిక, కీర్తి స్వప్నిక, ఉపేక్ష, అఫ్రీన్, రమ్యశ్రీ, జీవనశ్రీ, అర్థయ, దీక్షిత, కార్తీక, తన్మయ ఉన్నారు. చెస్ అండర్-14 జట్టులో రామ్ నచికత్, బి.గౌతమ్, ఎస్.గౌతమ్, ప్రత్యూష్‌కుమార్, నిహాల్ కార్తికేయన్, హిమశ్రీనిక, లక్ష్మీ సహస్ర, మహాలక్ష్మి, షణ్ముఖశ్రీ, హర్షిత ఉన్నారు. అండర్-17 జట్టులో సత్యప్రణవ్, రుత్విక్ సిద్దు, సాయి విఘ్నేష్, కార్తిక్, సుధా, వర్షిత, శ్రీకళ, పల్లవి ఉన్నారు. అండర్-17 ఖోఖో జట్టులో సాయి సిద్ధార్థ, మహేంద్ర, ప్రవీణ్‌కుమార్, యువన్‌తేజ్, అభిలాష్, చంద్ర, జావిద్, గణేష్, సాయి చరణ్, ధనుష్‌సాయి ఉన్నారు. బాలికల జట్టులో చైతన్య, దుర్గాభవాని, మహాలక్ష్మి, భవానీ, మాధురి, భార్గవి, అనీష, అనూష, ఇందు, సాయి, అఖిల, రమాదేవి, తేజశ్రీ ఉన్నారు.

వైద్య విద్యార్థికి చేయూత

ఈనాడు కథనానికి స్పందన

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: 'దాతలు స్పందిస్తే.. ఆ ఊరిలో తొలి వైద్యుడు' శీర్షికన మూడు రోజుల క్రితం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మానవతావాదులు స్పందిస్తున్నారు. ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన సుర్దేపల్లికి చెందిన శ్రీపతి చదువుల కోసం ఖమ్మానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు దండ్యాల సుబ్బారావు రూ.13 వేల చెక్కును ఆదివారం అందించారు. సుంకర ఫణికుమార్ రూ.20 వేలను ఫోన్‌పే ద్వారా పంపారు. 'ఈనాడు'కు, దాతలకు విద్యార్థి శ్రీపతి ధన్యవాదాలు తెలిపారు.

సత్తుపల్లి, న్యూస్‌టుడే: వైద్య విద్యార్థిని రాజిని శివభార్గవికి లయన్స్ క్లబ్ బాధ్యులు చేయూత అందించారు. స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సదరు విద్యార్థినికి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పెనుగొండ రమేశ్, ఉమామహేశ్వరరెడ్డి, గోగడ రవిలు రూ.32 వేలు సాయం చేశారు. సత్తుపల్లిలోని ప్రకాశం పంతులు వీధికి చెందిన సీతయ్య రూ.5వేలు అందజేశారు. కార్యక్రమాల్లో దారా కృష్ణారావు, సోమిరెడ్డి, లింగారెడ్డి, సీహెచ్ అప్పారావు, దొడ్డా కృష్ణయ్య, కొత్తూర రాజా, మాధురి మధు, పెద్దరాజు పాల్గొన్నారు.

అలరించిన 'నెలనెలా వెన్నెల'


హాలికులు సేమమా..? నాటికలో ఓ సన్నివేశం

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన 'నెలనెలా.. వెన్నెల' వీక్షకులను అలరించింది. అతిథులుగా నిర్మల్ హృదయ్ పాఠశాల కరస్పాండెంట్ వంగా సాంబశివారెడ్డి, బొమ్మా విద్యా సంస్థల ఛైర్మన్ బొమ్మా రాజేశ్వరరావు, సీఐటీయూ జిల్లా నాయకుడు వై.విక్రమ్ హాజరై మాట్లాడారు. 'హాలికులు సేమమా..?' నాటిక ఆలోచింపజేసింది. అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, అన్నాబత్తుల సుబ్రహ్మణ్య కుమార్, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు నాగబత్తిని రవి, వేల్పుల విజేత, నామా లక్ష్మీనారాయణ, వేముల సదానందం, కళాకారులు పాల్గొన్నారు.

ఆనందకరం.. రాములోరి అభిషేకం


దర్శించుకుంటున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయ పరిసరాలు ఆదివారం భక్తులతో సందడిగా మారాయి. మూలవిరాట్‌కు సుప్రభాతం పలికి ఆరాధించి నామార్చన చేశారు. అభిషేక మహోత్సవం, బంగారు పుష్పార్చన అలరించాయి. నిత్యకల్యాణం, తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఎస్పీ రోహిత్‌రాజ్ కుటుంబ సమేతంగా రాములవారిని దర్శించుకున్నారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని మమత ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ పువ్వాడ జయశ్రీ పేర్కొన్నారు. మమత ఆస్పత్రిలో రెండు రోజుల పాటు నిర్వహించిన టీఎస్ ఎపికాన్ జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ఆధునిక కాలంలో కొత్త జబ్బులు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. అంతే వేగంగా ఔషధాలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ఖమ్మం సదస్సు అనేక ఆవిష్కరణలకు వేదికగా నిలిచిందన్నారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. సదస్సులో 60 మంది ప్రతినిధులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. మూడు సెమినార్లకు వెయ్యిమంది పీజీ వైద్యులు హాజరయ్యారని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫిజీషియన్ రాష్ట్ర అసోసియేషన్ ఛైర్మన్ రమేశ్, నిర్వహణ కమిటీ బాధ్యులు కన్నెగంటి శివరామకృష్ణ, కె.శ్రీకాంత్, అనుదీప్ పాల్గొన్నారు.


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న పువ్వాడ జయశ్రీ, హాజరైన ప్రతినిధులు

నవంబరు 3న 'సకల ఉద్యోగుల వన సమారాధన'


మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు, కస్తాల సత్యనారాయణ, రవీంద్ర ప్రసాద్, సైదులు, శ్రీనివాస్

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: నవంబరు 3న ఖమ్మంలో సకల ఉద్యోగుల కుటుంబాలతో కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు ఉద్యోగ ఐకాస(ఐక్య కార్యాచరణ సమితి) రాష్ట్ర సెక్రటరీ జనరల్, టీజీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. అటెండర్ నుంచి జిల్లా అధికారి వరకు పాల్గొనాలని కోరారు. ఖమ్మంలోని టీఎన్జీఓ భవన్‌లో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మంలో నివాసముంటున్న భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు చెందిన పలువురు ఉద్యోగులను సైతం ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని సుమారు 75కు పైగా రాష్ట్ర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు రేణుకా చౌదరి, రామసహాయం రఘురాంరెడ్డి సహా ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లను సత్కరించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఐకాస జిల్లా నాయకులు కస్తాల సత్యనారాయణ, మల్లెల రవీంద్ర ప్రసాద్, కొణిదెన శ్రీనివాసరావు, గుంటుపల్లి శ్రీనివాసరావు, ఎస్టీఎఫ్ సైదులు, కల్యాణం కృష్ణయ్య, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీబీఐ దర్యాప్తు చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల ఐకాస జాతీయ అధ్యక్షుడు చందా లింగయ్యదొర

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులోని చిక్కుడుగుంట వద్ద నిర్మించిన బీటీపీఎస్‌లో రూ.400 కోట్ల కుంభకోణం జరిగిందని, వెంటనే సీబీఐ దర్యాప్తు చేపట్టాలని ఆదివాసీ సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు చందా లింగయ్య దొర డిమాండ్ చేశారు. ఆదివారం బీటీపీఎస్ సమీపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీటీపీఎస్ నిర్మాణంలో భాగంగా కేసీఆర్ ప్రభుత్వం ఆదివాసీలకు చెందిన భూములను లాక్కొని మొండిచేయి చూపిందన్నారు. భూములు కోల్పోయిన ఆదివాసీలకు నష్టపరిహారం, ప్రత్యేక ప్యాకేజీలు చట్ట ప్రకారం చెల్లించలేదన్నారు. భూమికి బదులు భూమి ఇస్తామని మాయమాటలు చెప్పి పదేళ్లపాటు కాలం వెళ్లదీశారన్నారు. భూసేకరణ కోసం కేటాయించిన డబ్బులను కొంతమంది దళారులు అధికారులతో కుమ్మక్కై రెవెన్యూ రికార్డులు మార్చి ఆదివాసీల సొమ్మును కాజేశారని, ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా ఆదివాసీలకు ఎటువంటి న్యాయం చేయలేదన్నారు. ఈ విషయంపై అతిత్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సీబీఐ లేదా సీబీసీఐడీ దర్యాప్తు చేపట్టాలని కోరుతామన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ నాయకులు, భూనిర్వాసితులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య


నరసమ్మ


నిందితులు భూక్య ప్రసాద్, నెల్లూరి మల్లేశ్వరి

కల్లూరు, న్యూస్‌టుడే: తనతో కాపురం చేయాలంటూ ఒత్తిడి చేస్తున్న రెండో భార్యను, మూడో భార్య సాయంతో ఓ వ్యక్తి దారుణంగా హతమార్చిన ఘటన కల్లూరులో వెలుగుచూసింది. ఈ నెల 15న కల్లూరు పరిధిలో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన విషయం విదితమే. ఈ కేసును పోలీసులు ఛేదించి నిందితులను రిమాండ్‌కు పంపారు. ఇందుకు సంబంధించిన వివరాలను కల్లూరు ఏసీపీ ఎ.రఘు ఆదివారం స్థానిక ఠాణాలో వెల్లడించారు. కల్లూరు మండలం లక్ష్మీపురానికి చెందిన భూక్య ప్రసాద్ ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. తల్లాడ మండలం పాయపూర్‌కు చెందిన కల్యాణితో 20 ఏళ్ల క్రితం వివాహం కాగా మధ్యలోనే ఆమెను వదిలేశాడు. ఆ తర్వాత భద్రాద్రి జిల్లా కొత్తగూడేనికి పనినిమిత్తం వెళ్లిన ప్రసాద్ అక్కడ నారాయణపురం నరసమ్మ(39)ను రెండో పెళ్లి చేసుకుని లక్ష్మీపురంలో కాపురం పెట్టాడు. ఏడాది నుంచి నరసమ్మతో సఖ్యత కొరవడింది. ఈ నేపథ్యంలో ఏపీలోని నెల్లూరు జిల్లా చల్లాయిపాలెంకు కరెంటు పనికి వెళ్లాడు. అక్కడ నెల్లూరి మల్లేశ్వరితో సన్నిహితంగా ఉంటూ ఆమెను మూడో పెళ్లి చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న నరసమ్మ స్టేషన్‌లో ప్రసాద్ తీరుపై ఫిర్యాదు చేసింది. కాపురానికి రావాలని పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టింది. దీంతో ఆమెపై కోపం పెంచుకున్న ప్రసాద్ నరసమ్మను హతమార్చాలని పథకం రచించాడు. 'ఇద్దరం కలిసి ఉందాం, గొడవలు వద్దు మాట్లాడుకుందామ'ని నమ్మించి కొద్ది రోజుల క్రితం కల్లూరు శివారులోని పోట్రు కృష్ణయ్య మామిడి తోటకు పిలిపించాడు. అక్కడ ఆమెతో గొడవపడి తలభాగంలో చేతితో దాడి చేశాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన తర్వాత మల్లేశ్వరి సాయంతో నరసమ్మ మెడకు చీరను బిగించి హతమార్చారు. తర్వాత మృతదేహాన్ని పుల్లపుకుంటలో పడేసి వెళ్లిపోయారు. ఈ ఘటనపై విచారణ చేసిన పోలీసులు హత్యకు పాల్పడిన ప్రసాద్, మల్లేశ్వరిలను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. కేసును ఛేదించడంలో కృషి చేసిన సిబ్బంది పరుచూరి రమేశ్, చెన్నూరి అశోక్, సోమవరకు శ్రీనివాసరావులను అభినందించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. సత్తుపల్లి గ్రామీణ సీఐ ముత్తు లింగయ్య, కల్లూరు ఎస్ఐ షాకీర్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు బలగం అమరులకు సెలాం



ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే

పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం శ్రమిస్తుంటారు. విద్రోహ చర్యలు, మావోయిస్టు దాడుల్లో అమరులైన పోలీసుల సేవలను గుర్తు చేసుకునేందుకు ఏటా 'పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం' నిర్వహిస్తుంటారు. నేటి నుంచి నెలాఖరు వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు ఉండనున్నాయి.

ఏమిటీ దినోత్సవం

ఈ దినం వెనుక ఓ విషాద సంఘటన ఉంది. 1959 అక్టోబరు 21న కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు(సీఆర్‌పీఎఫ్) భారత్-చైనా సరిహద్దుల్లో రక్షణ విధుల్లో ఉన్నాయి. డీఎస్పీ కరమ్‌సింగ్ నేతృత్వంలో పంజాబ్‌కు చెందిన 21 మంది బృందం గస్తీలో ఉంది. చైనా రక్షణ బలగాలు సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో వీరు అడ్డుకున్నారు. వేడి నీటి బుగ్గ(హాట్ స్ప్రింగ్స్) ప్రాంతంలో జరిగిన వీరోచిత పోరాటంలో పది మంది భారత జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. వారి త్యాగానికి గుర్తుగా పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని జరుపుతున్నారు.

నెలాఖరు వరకు.. కార్యక్రమాలు

ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలో అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపనున్నారు. 31న జరిగే సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఖమ్మం సీపీ సునీల్‌దత్ తెలిపారు. ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసు విధులు, త్యాగాలు, సాంకేతిక వినియోగం, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, స్నేహ పూర్వక పోలీసు వ్యవస్థ వంటి విషయాలను వివరించనున్నారు. సైకిల్ ర్యాలీ, మెగా రక్తదాన శిబిరాలు వంటి కార్యక్రమాలు చేపడతారు.

ఉమ్మడి జిల్లాలో 22 మంది..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 22 మంది పోలీసులు అమరులయ్యారు. విద్రోహ, నక్సలైట్ల దాడుల్లో మృతి చెందిన పోలీసు సిబ్బందిని అమరవీరులుగా గుర్తిస్తారు. ఏ జిల్లాలో నియమితులైన వారిని ఆ జిల్లాకు చెందిన వారిగా పరిగణిస్తారు.

ప్రధాన సంఘటనలు

★ 1992 సెప్టెంబరు 4న రాళ్లవాగు వద్ద ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాల నగదు తీసుకెళ్తున్న వ్యానుకు రక్షణగా వెళ్తున్న పోలీసు వాహనాన్ని నక్సలైట్లు పేల్చివేశారు. ఈ ఘటనలో 10 మంది పోలీసు సిబ్బంది మృతి చెందారు. ★ 1992 అక్టోబరు 27న మోతుగూడెం దగ్గర డొంకరాయి రోడ్డుపై తునికాకు లారీ నక్సలైట్లు తగులబెట్టారు. విద్యుత్తు సామగ్రి తీసుకువస్తున్న లారీలో వస్తున్న పోలీసు సిబ్బంది సింధువాడ వద్ద నక్సలైట్లు ల్యాండ్‌మైన్ పేల్చడంతోపాటు, జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక ఎస్ఐ సహా నలుగురు పోలీసులు అమరులయ్యారు.
★ 1997 జనవరిలో కరకగూడెం పోలీసు స్టేషన్‌పై నక్సలైట్లు దాడి చేయగా ఎనిమిది మంది పోలీసులు, ఎనిమిది మంది ఏపీఎస్పీ బెటాలియన్ పోలీసులు అమరులయ్యారు.

స్మారక స్తూపం

1997లో ఖమ్మం జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో పూర్తిగా గ్రానైట్ రాయితో పోలీసు అమరవీరుల స్మారక స్తూపాన్ని నిర్మించారు. ఇక్కడ పోలీసు అధికారులు, సిబ్బంది నివాళులర్పించడం ఆనవాయితీ.

ప్రమాదవశాత్తు బావిలో పడి కూలీ మృతి

కూసుమంచి, న్యూస్‌టుడే: నాయకన్‌గూడేనికి చెందిన కిన్నెర శ్రీను(40) అనే వ్యక్తి ఆదివారం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. కూలీ పనులతో కుటుంబాన్ని పోషించే శ్రీను వంటకలప కోసం వెళ్లిన క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. విద్యుత్తు తీగను తాకి విద్యుదాఘాతంతో బావిలో పడి ఉంటాడని భావిస్తున్నారు. శ్రీను భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కూసుమంచి ఎస్ఐ నాగరాజు తెలిపారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

భద్రాచలం

•భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

కుమురం భీం వర్ధంతి



కుమురం భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదివాసీ జేఏసీ మండల నాయకులు

అశ్వాపురం, న్యూస్‌టుడే: ఆదివాసీ జేఏసీ అశ్వాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో కుమురం భీం వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. కమిటీ మండల అధ్యక్షుడు కల్లూరి నరసింహారావు చింతిర్యాల అడ్డరోడ్డులోని భీం విగ్రహానికి నివాళి అర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న అశ్వాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూనెం వెంకటేశ్వర్లును సన్మానించారు. కార్యక్రమంలో పొడియం బాలరాజు, తంగెళ్ల భద్రయ్య, మండల బండ్ల మునేశ్వరరావు, చంద్రశేఖర్, సూర్యనారాయణ, అనిల్‌కుమార్, ముత్తయ్య, రామారావు, తెల్లం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు గిరిజన దర్బారు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం ఐటీడీఏలో సోమవారం ఉదయం 10.30 గంటలకు గిరిజన దర్బారు ఉంటుందని, సంబంధిత అధికారులు సకాలంలో హాజరు కావాలని పీఓ రాహుల్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజనులు తమ సమస్యలను వినతులను రాతపూర్వకంగా తెలపాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ కృషి చేస్తుందని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: భద్రుగూడెం గ్రామ పంచాయతీలో కొన్ని చోట్ల విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. - స్థానికులు

సమాధానం: ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకెళ్లి విద్యుత్తు దీపాల కోసం ఇండెంట్ పెడతాం. వాటి ఏర్పాటుకు చర్యలు చేపడతాం. **సాహితి, పంచాయతీ కార్యదర్శి** - దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

దమ్మపేట ప్రధాన రహదారి, కొత్తపేట, బంజారా, అర్బన్‌కాలనీల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకుని సమస్యను పరిష్కరించాలి. - **రవికుమార్, దమ్మపేట.**

✔ పంచాయతీలో చెత్తకుప్పలు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. ఇంకా ఎక్కడైనా చెత్త కుప్పలు మిగిలిపోతే సోమవారం ప్రత్యేక కార్యక్రమం చేపట్టి వాటిని తొలగిస్తాం. - **ప్రవీణ్‌కుమార్, దమ్మపేట పంచాయతీ కార్యదర్శి** - దమ్మపేట, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట పట్టణంలో శివయ్య వీధిలో పేరుకుపోయిన చెత్త చెదారం తొలగించాలని 'మేమున్నాం మీకుతోడు'గా లో ఈ నెల 19న ప్రచురితమవడంతో పంచాయతీ కార్యదర్శి కె.శ్రీరామ్మూర్తి స్పందించారు. పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందితో వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు.

ఆకట్టుకుంటున్న శ్రీరామకోటి దండ



పలు భాషల్లో శ్రీరామకోటి రాసి ఇలా..

భద్రాచలం, న్యూస్‌టుడే: శ్రీరామకోటి రాయాలంటే అమితమైన భక్తితో పాటు అదేస్థాయి శ్రద్ధ ఉంటేనే సాధ్యం. ఇలా రాసిన పుస్తకాలను భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంభం ఎదుట ఉన్న హుండీలో సమర్పిస్తుంటారు. ఇటీవల ఆలయ దర్శనం చేసుకున్న భక్తులు ఈ హుండీ వద్ద అలంకరించిన దండను చూసి భక్తితో నమస్కరిస్తున్నారు. ఇది వివిధ భాషల్లో రామకోటి నామాలతో ఉండడంతో ఆధ్యాత్మికులను అలరిస్తోంది. తెల్ల కాగితాలపై శ్రీరామ జయ రామ, జైశ్రీరాం, రామ రామ అంటూ రాసి వాటిని చుట్టి తాడు సాయంతో దండగా అల్లారు. ఈ దండను ఇక్కడి రామకోటి హుండీకి అలంకరించారు. శుభం కలగాలని ఇలా రాసి ఉంటారని ఇక్కడకు వచ్చే భక్తులు భావిస్తూ ఆ దండను తాకి తన్మయులవుతున్నారు.

స్నాన ఘట్టాల వద్ద.. భక్తులకు రక్షణేదీ..?

వరుస సంఘటనలతో బెంబేలు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే



భద్రాచలంలోని గోదావరి ఒడ్డున స్నానమాచరిస్తున్న భక్తులు

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలం వద్ద గోదావరి నది వద్ద రక్షణ చర్యలు లేకపోవడంతో భక్తులు స్నానమాచరించాలంటే బెంబేలు పడే పరిస్థితులు నెలకొంటున్నాయి. వరుస ఘటనలు చోటుచేసుకోవడంతో వణికిపోతున్నారు. రక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఆ దిశలో ఊసే ఎత్తడం లేదు. దీంతో ఏ క్షణాన ఏమి జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది.

✦ నాలుగు రోజుల కిందట ముగ్గురు చిన్నారులతో పాటు ఓ మహిళ గోదావరిలో పుణ్య స్నానానికి దిగి లోతు అర్థంగాక లోపలికి వెళ్లి ప్రాణాపాయ స్థితిలో చిక్కుకోవడంతో ఓ ఫొటోగ్రాఫర్ ఫొటోగ్రాఫర్ ప్రాణాలకు తెగించి కాపాడారు. రెండు రోజుల కిందట ఓ గజ ఈతగాడు ఇద్దరు వ్యక్తులు మునిగిపోతుంటే కాపాడారు. తాజాగా ఆదివారమూ ఓ వ్యక్తి నది లోతును అంచనా వేయక మునిగిపోతుంటే కాపాడారు. ఇలా వరుస సంఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రాణాపాయ స్థితి నుంచి త్రుటిలో తప్పించుకున్న వారు ఏడాదిలో పదుల సంఖ్యలోనే ఉంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్నానానికి దిగి నది లోతు అంచనా తెలియక ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ గతంలో ఉన్నాయి. అయినా అధికారులు శాశ్వత చర్యలు చేపట్టడంలో చేతులెత్తేశారు.

✦ ముఖ్యమైన పర్వదినాల సమయంలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసి మిగిలిన సమయంలో వారిని పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. ఇకనైనా శాశ్వత ప్రతిపాదికన అక్కడ పకడ్బందీగా రక్షణ చర్యలు ఏర్పాటు చేయడం, పూర్తి స్థాయిలో గజ ఈతగాళ్లను విధుల్లోకి తీసుకోవాల్సి ఉంది. అలాగే రెండు చిన్న పడవలను ఏర్పాటు చేసి.. ఎప్పటికప్పుడు లోనికి దిగేవారికి సూచనలు ఇచ్చేలా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అటు దేవస్థానం, అటు నీటి పారుదల అధికారులు గానీ ఈ దిశలో చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

✦ ఈ పరిస్థితిపై నీటిపారుదల శాఖ ఈఈ రాంప్రసాద్‌ను వివరణ కోరగా ఇప్పటికే ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే చర్యలు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు.

ప్రజలు మావోయిస్టులకు సహకరించొద్దు: డీఎస్పీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సంఘవిద్రోహ శక్తులు, మావోయిస్టులకు సహకరిస్తే ఉపేక్షించేదిలేదని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. ఆదివారం ఆళ్లపల్లి పోలీసు ఠాణాను సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. విధినిర్వహణ, వ్యక్తిగత అంశాల్లో ఏమైనా సమస్య లుంటే నేరుగా తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. టేకులపల్లి సీఐ సురేశ్, ఆళ్లపల్లి ఎస్సై రతీశ్, ఏఎస్సై వెంకట్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్స్ కృష్ణమూర్తి, రాజేశ్వరరావు, సిబ్బంది శ్రీనివాసరావు, ఉపేందర్, వెంకటేశ్వర్లు, శ్రీను, కన్నయ్య, నారాయణ పాల్గొన్నారు.

వృద్ధురాలిని కాపాడిన గజ ఈతగాడు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: తన కుటుంబ కలహాలతో మనసు బాగోలేక భద్రాచలం వద్ద గోదావరి నదిలో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వృద్ధురాలిని గజ ఈతగాడు ప్రసాద్ కాపాడారు. స్నాన ఘట్టాల వద్ద వృద్ధురాలిని కాపాడి పోలీసులకు అప్పగించారు. ఆమె పాల్వంచకు చెందిన నాగలక్ష్మిగా తెలిపారు. తన వాళ్లు ఉన్నప్పటికీ తనను చూడటంలేదనే మనస్తాపంతో ఇక్కడకు వచ్చినట్లు వెల్లడించింది. అలాగే భద్రాచలానికి చెందిన మరో యువకుడు స్నానానికి వెళ్లి ప్రమాదంలో చిక్కుకుపోగా మునిగిపోతున్న అతడిని సైతం ఆదివారం కాపాడినట్లు ప్రసాద్ తెలిపారు.

చంద్రుగొండ ఎస్సైకి కాంస్య పతకం



సీపీ అవినాష్ మెహంతి నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న స్వప్న

చంద్రుగొండ, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీమీట్‌లో చంద్రుగొండ ఎస్ఐ గంజి స్వప్నకు రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం లభించింది. హైదరాబాద్ సీపీ అవినాష్ మెహంతి చేతుల మీదుగా ఆమె ఈ పతకాన్ని శనివారం అందుకున్నారు. విధి నిర్వహణలో ఆమె చూపిన ప్రతిభ ఆధారంగా ఈ పతకాన్ని అందజేశారు. త్వరలో జార్ఖండ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోలీస్ మీట్‌లో ఆమె పాల్గొననున్నారు.

బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

ములకలపల్లి, న్యూస్‌టుడే: భాజపాను బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముసలయ్య సూచించారు. భాజపా ఆధ్వర్యంలో ఆదివారం ములకలపల్లిలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలపై నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శంకర్, ప్రసాద్, రాంబాబు, సాయి, రంగ, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఏటీసీ కోర్సులను సద్వినియోగం చేసుకోండి

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏటీసీ కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటీసీలో ఆరు కోర్సులు అందుబాటులో ఉన్నాయని, యువతకు మెరుగైన ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఐటీసీలను నెలకొల్పిందని పేర్కొన్నారు. ప్రవేశాలు కొనసాగుతున్నాయన్నారు.

కల్లుగీత సంఘం అధ్యక్షుడి ఎన్నిక

అశ్వాపురం, న్యూస్‌టుడే: మొండికుంటలో ఆదివారం కల్లు గీత కార్మిక సంఘం సమావేశంలో మండల అధ్యక్షుడిగా పొడిశెట్టి రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌడ సంఘం నాయకులు గంగరాజుగౌడ్, చల్లమల కంట్లమయ్య, ఉప్పలయ్య, సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో భారీ వర్షం

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేటలో ఆదివారం భారీ వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా సాయంత్రం భారీగా వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గౌడబజారు, కళింగుల వీధి, ఖమ్మం మార్గం నీటితో చెరువులను తలపించాయి. సంతమార్కెట్ అంతా వరదనీటితో నిండిపోయింది.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం

అశ్వాపురం, న్యూస్‌టుడే: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, ఆదివాసీ అశ్వాపురం మండల జేఏసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన ఏనిక రవీందర్, సోయం రమేశ్, కొమరం పద్మలను ఆదివారం ఘనంగా సన్మానించారు. పి.సూర్యనారాయణ, నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: లక్ష్మీనగరం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళా ఉపాధ్యాయులను ఆదివారం కొందరు గ్రామస్థులు శాలువాలతో సత్కరించారు. రేవుల్ల అశ్విని శ్రీనగర్ కాలనీలో, రోకళ్ల సౌందర్య దబ్బనూతుల ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయినిలుగా నియమితులయ్యారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఐఈడీ గుర్తింపు.. పేల్చివేత

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన ఐఈడీ(ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్)ను భద్రతా బలగాలు గుర్తించాయి. కొర్చేలి అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ(డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డు), కోబ్రా-202 నేతృత్వంలోని ఉమ్మడి బలగాలు ఆదివారం ఏరియా డామినేషన్‌కు వెళ్లాయి. ఈ క్రమంలో కొర్చేలి గ్రామ శివారులోని పుట్‌పాత్‌పై భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు ఏర్పాటు చేసిన 5 కిలోల ఐఈడీని గుర్తించాయి. బాంబు డిస్పోజల్ స్క్వాడ్ ఐఈడీని పేల్చివేసింది.

ప్రమాదాల నివారణకు మరమ్మతులు



అశ్వాపురం మండలంలోని సీతారాంపురం నుంచి మొండికుంట వరకు సుమారు అయిదు కిలోమీటర్ల పొడవునా ప్రమాదకరంగా తయారైన ప్రధాన రహదారి ఎడమ వైపు భాగాన్ని ఆర్అండ్‌బీ అధికారులు బాగు చేస్తున్నారు. రహదారి ఎత్తుపల్లాలుగా మారడంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. ఈ విషయమై ఆర్అండ్‌బీ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ తెల్లాకుల కృష్ణను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. రహదారి బాగు చేస్తున్నామని, ప్యాచ్‌వర్క్ చేస్తామని వెల్లడించారు. – అశ్వాపురం, న్యూస్‌టుడే

ఈ కల్వర్టు వద్ద.. జర భద్రం



సారపాక నుంచి బూర్గంపాడు వెళ్లే మార్గంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం వద్ద ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఓ వైపు కల్వర్టు కూలిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో విరిగిన కల్వర్టును గమనించక పోతే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఆర్అండ్‌బీ డీఈ హరిలాల్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా... నూతన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. – బూర్గంపాడు, న్యూస్‌టుడే

'రైతు భరోసా' నిధులను తక్షణమే విడుదల చేయాలి



మణుగూరులో ధర్నా చేస్తున్న భారాస నాయకులు

మణుగూరు సాంస్కృతికం, పినపాక, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉన్న రైతులందరికీ రైతుభరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారాస ఆధ్వర్యంలో ఆదివారం మణుగూరులోని ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ సభ్యులు పోశం నర్సింహారావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ప్రకటించిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. నాయకులు ముత్యంబాబు, అప్పారావు, కుర్రి నాగేశ్వరరావు, వట్టం రాంబాబు, యాదగిరి, లక్ష్మణ్, కృష్ణ, ఆవుల నర్సన్న, జ్యోతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

✦ రైతులందరికీ రైతు భరోసా అందజేయాలని భారాస పినపాక మండలాధ్యక్షుడు సతీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. పినపాక మండలం ఏడూళ్లబయ్యారం అడ్డరోడ్డులోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. నాయకులు భవానీశంకర్, వాసుబాబు, దొడ్డా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26న భద్రాచలంలో 'మాదిగ సమ్మేళనం'

అశ్వాపురం, న్యూస్‌టుడే: భద్రాచలంలో ఈనెల 26న మాదిగ సమ్మేళనం జరుగనుందని, మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఏక సభ్య న్యాయ కమిషన్ ఏర్పాటును స్వాగతిస్తున్నామన్నారు. 30ఏళ్ల కల నెరవేరే సమయం ఆసన్నమైందన్నారు. మాదిగలు రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలబడాలన్నారు. మాదిగ జేఏసీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రహదారి నిర్మాణానికి ప్రతిపాదన

ఈనాడు కథనానికి స్పందన

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట పట్టణం నుంచి పేటమాలపల్లి మీదుగా ఏపీలోని గారపాటి మకాంకు రహదారి నిర్మించాలని, దీనివల్ల వందలాది ఎకరాల్లో సేద్యం చేస్తున్న రైతులకు ఉపయోగంగా ఉంటుందని.. ఆ ప్రాంత రైతులు అనేక ఏళ్లుగా విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరేళ్ల కిందట అశ్వారావుపేట-గారపాటి మకాం మార్గంలో మూడు కిలోమీటర్ల మేర తారురోడ్డు వేశారు. గారపాటి మకాంకు(తెలంగాణ సరిహద్దు వరకూ) వెళ్లాలంటే మరో కిలోమీటరన్నర తారురోడ్డు వేయాల్సి ఉంది. ఈ సమస్యపై ఈనెల 1న 'ఈనాడు'లో కథనం ప్రచురితమవడంతో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పందించారు. రూ.1.50 కోట్ల అంచనాతో తారురోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి ర.భ.శాఖ మంత్రికి అందజేశారు. మరో పది రోజుల్లో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు కానున్నాయని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ములకపాడు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ఆదివారం తీవ్రంగా గాయపడ్డాడు. పాల్వంచ మండలం ఉల్వనూరు గ్రామానికి చెందిన పాయం నర్సింహారావు అనే వ్యక్తి ఆటో నడుపుతూ ములకపాడు గ్రామం వైపు వస్తున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడటంతో అతని తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

లారీని వెనుకనుంచి ఢీకొని..

ములకలపల్లి, న్యూస్‌టుడే: పాల్వంచ నుంచి దమ్మపేట వైపు వెళుతున్న ద్విచక్రవాహనం ములకలపల్లి పోలీస్ గృహసముదాయాల ఎదుట ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని ద్విచక్ర వాహనదారుడు గాయపడటంతో 108లో మంగపేట పీహెచ్‌సీకి తరలించారు. లారీ ఆపకుండా వెళుతుండటంతో పోలీసులు వెంబడించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ప్రమాద ఘటనపై కేసు నమోదు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం అంబేడ్కర్ సెంటర్‌లో ద్విచక్రవాహనంపై వస్తున్న ముదిగొండ ముత్యాలరావును ఈనెల 17న స్థానిక ఓ ప్రైవేటు పాఠశాల వాహనం ఢీకొనడంతో కాలు విరిగింది. బాధితుడి కుమారుడు ఆదివారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందాల స్థావరంపై పోలీసుల దాడి

అశ్వారావుపేట గ్రామీణం: కేశప్పగూడెంలో నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యయాతి రాజు తెలిపారు.

గొత్తికోయల కుల ధ్రువపత్రాల జారీకి ఉద్యమం: గోపగాని

చర్ల, న్యూస్‌టుడే: గొత్తికోయ యువతకు అన్యాయంగా నిలిపివేసిన కుల ధ్రువీకరణ పత్రాలను తక్షణమే జారీ చేయాలని లేకుంటే వారి పక్షాన పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని తెజస ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌ఛార్జి గోపగాని శంకరరావు హెచ్చరించారు. చర్లలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూల ఆదివాసీలైన గొత్తికోయలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడం నేరమన్నారు. 2021 వరకు గొత్తికోయ పిల్లలకు కోయ కుల ధ్రువపత్రాలు ఇచ్చి అర్ధాంతరంగా నిలిపివేయడంతో వారు చదువులు ఆగిపోయి భవిష్యత్తు నాశనమవుతోందన్నారు. ప్రభుత్వ పథకాలు వారికి అందని ద్రాక్షగా మారాయన్నారు. 50 ఏళ్ల కిందటే వచ్చి తెలంగాణ వాసులుగా స్థిరపడ్డ గొత్తికోయల హక్కులకు భంగం కల్పిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. అలాగే మన్యంలో చట్టాలను తుంగలో తొక్కి ఇసుక తవ్వకాలను అనుమతులు ఇవ్వడం సరైంది కాదన్నారు. కొందరు ఇసుక మాఫియా గిరిజన సొసైటీలను అడ్డం పెట్టుకొని రూ.కోట్లు గడిస్తూ పెసా, షెడ్యూల్ చట్టాలను తుంగలో తొక్కుతున్నారని ఆక్షేపించారు. గోదావరి నదిలో భారీ యంత్రాలు ఏర్పాటు చేయకుండా గిరిజనులకు ఉపాధి కల్పించాలని చట్టాలు చెబుతున్నా వాటికి పాతరేస్తున్నారని విమర్శించారు. పూనెం ప్రదీప్ కుమార్, రేపాక రామారావు గుప్తా, మడకం చందు, జలగం సోమయ్య పాల్గొన్నారు.



చర్లలో మాట్లాడుతున్న తెజస ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌ఛార్జి శంకరరావు

'మాలల మహాపాదయాత్రను జయప్రదం చేయండి'

మణుగూరు సాంస్కృతికం, బూర్గంపాడు, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోసం భద్రాచలం నుంచి ఈనెల 25న ప్రారంభించనున్న మాలల మహా పాదయాత్రను జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పూల రవీందర్ అన్నారు. మణుగూరులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొత్తం 16 జిల్లాల్లోని 35 నియోజకవర్గాల్లో 38 రోజులపాటు 1,000 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు ఎడవల్లి భవానీ శంకర్, పార్వతి, మయ్యా శ్రీనివాసరావు, బూర్గుల సతీష్, బిక్షపతి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

✦ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 25న నిర్వహించ తలపెట్టిన మహా పాదయాత్రను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శి, పాదయాత్ర జిల్లా కమిటీ బాధ్యుడు రమణమూర్తి కోరారు. బూర్గంపాడు మండలం మోరంపల్లిబంజరలో పాదయాత్ర గోడపత్రాలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో రమేశ్, దివ్య, జయ తదితరులు పాల్గొన్నారు.



మహా పాదయాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న రవీందర్

ఎట్టకేలకు మురుగు కాలువ నిర్మాణం



చంద్రుగొండలో మురుగు కాలువ నిర్మాణం ఎట్టకేలకు సాగుతున్నాయి. సెప్టెంబరులో ఈ పనులను ప్రారంభించగా వివిధ వివాదాలతో పనుల్లో జాప్యం చేసుకుంది. ఈ పనులపై స్థానికుల్లో కొంత వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. ఎట్టకేలకు అధికారులు దృష్టి సారించడంతో పనులు కొనసాగుతున్నాయి. ప్రధాన సెంటర్ నుంచి లంకలవాగు ముత్యాలమ్మ వరకు, రావిచెట్టు సెంటర్ నుంచి బెండాలపాడు వెళ్లే రహదారి వరకు మురుగు కాలువ నిర్మాణం చేపట్టారు. మురుగు కాలువ నిర్మాణానికి రూ.3.12 కోట్లు మంజూరయ్యాయి. ర.భ.శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. రహదారి మధ్య నుంచి ఇరువైపుల 28 అడుగుల దూరంలో మురుగు కాలువ పనులు చేపట్టారు. పనులను ర.భ శాఖ ఏఈ లఖన్ నాయక్ పర్యవేక్షిస్తున్నారు. – చంద్రుగొండ, న్యూస్‌టుడే

అంతర్గత రహదారుల దుస్థితి మారేనా?

మండలంలో ప్రధానమైన మందలపల్లి పంచాయతీలో అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధానంగా ప్రకాశ్‌నగర్‌కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వీధుల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఈ అంతర్గత రహదారులు గోతులు, కోతలతో కనీసం నడిచేందుకు వీలులేకుండా ఉన్నాయి. వర్షం వస్తే ఇక ఇక్కడి ప్రజల ఇబ్బంది చెప్పనలవికాకుండా ఉంది. కమ్మకల్యాణమండపం నుంచి జాతీయ రహదారికి వచ్చే అంతర్గరహదారి మరింత దారుణంగా ఉంది. రోడ్డంతా పిచ్చిమొక్కలు, బురదతో నిండిపోయింది. గ్రామంలో అంతర్గత రహదారులను బాగు చేయాలని స్థానికులు వేడుకుంటున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి గోపీ మాట్లాడుతూ.. మందలపల్లిలో బస్టాండ్ వెనుక, ప్రకాశ్‌నగర్ కాలనీలో పలు అంతర్గత రహదారులను సీసీగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

– దమ్మపేట, న్యూస్‌టుడే



ఆర్టీసీ బస్టాండు సమీపంలో కోతకు గురైన అంతర్గత రహదారి

పచ్చిక బీడుగా.. పల్లె ప్రకృతి వనం

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే

ఈ చిత్రాన్ని చూస్తే ఇదేదో పచ్చిక బీడు అనుకోక మానరు. కానీ ఇది నారంవారిగూడెం పల్లె ప్రకృతి వనం. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో పలు రకాల మొక్కలతోపాటు కోనోకార్పస్ మొక్కలనూ నాటారు. ఈ మొక్కల కారణంగా శ్వాసకోశ వ్యాధులు వస్తున్నట్లు భావించిన ప్రభుత్వం వాటిని తొలగించాలని ఆదేశాలిచ్చింది. ఆ ఆదేశాలతో ఈ పల్లె ప్రకృతి వనంలో ఉన్న కోనోకార్పస్ మొక్కలను నరికి వేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. వనానికి చుట్టూ కంచె లేకపోవడంతో వనంలోకి పశువులు ప్రవేశించడంతో అక్కడ ఉన్న మిగతా మొక్కలూ దెబ్బతింటున్నాయి.



నారంవారిగూడెం పల్లె ప్రకృతి వనం ఇలా..

✦ ఈ అంశమై పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకు వెళ్లగా.. ప్రకృతి వనం చుట్టూ త్వరలోనే కంచెను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. నరికేసిన మొక్కల స్థానంలో తిరిగి మొక్కలు నాటతామన్నారు.

కొత్తగూడెం
• కొత్తగూడెం • ఇల్లెందు



కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: కిన్నెరసానిలో బోటు షికారు జోరుగా సాగింది. పచ్చని చెట్లు.. అలలపై నుంచి వచ్చే చల్లని గాలుల్లో బోటు ప్రయాణం చేయడానికి పర్యాటకులు ఆసక్తి చూపారు. స్పీడు బోటు, ఫాంటూన్ బోటుల్లో షికారు చేస్తూ ఆనందంలో మునిగి తేలారు. రాష్ట్ర నలుమూలల నుంచి 350 మంది పర్యాటకులు వచ్చారు. బోటు ఆదాయం రూ.15,560, టోల్‌గేటు రూ.12,360 వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

24 నుంచి మెడికల్ బోర్డు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: ప్రధాన వైద్యశాలలో ఈ నెల 24, 25తేదీల్లో మెడికల్ బోర్డు నిర్వహించనున్నారు. 24న బోర్డుకు దరఖాస్తు చేసుకున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. 25న పలు ప్రాంతాల నుంచి వచ్చిన వైద్యులు బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులను వైద్యపరంగా విధులకు అర్హులా? అనర్హులా అని నిర్ణయించనున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కొత్తగూడెం: 8008573723 పాల్వంచ: 9550076766 ఇల్లెందు: 9154846689

సమస్య: రాజీవ్‌గృహకల్ప భవన సముదాయాల నుంచి మురుగునీరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తుండటంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. - **న్యూగొల్లగూడెం వాసులు**

సమాధానం: శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.
- **రాజకుమారి, కౌన్సిలర్**

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే



పాత పాల్వంచ ఆర్టీ కాలనీలోని మురుగుకాలువలో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. పిచ్చి మొక్కలు పెరిగి దోమలు, విషపురుగులు సంచరిస్తున్నాయి. - **ధర్మ, స్థానికుడు**

✔ ఏరియా జవాన్‌కు చెప్పి సమస్య పరిష్కరిస్తాం. - **కేవీ లక్ష్మణ్‌రావు, పారిశుద్ధ్య అధికారి**

పాల్వంచ, న్యూస్‌టుడే

జెండా రెపరెపలు.. పట్టణ సొబగులు!



పాల్వంచలో జాతీయ రహదారి పక్కన ఎత్తైన ప్రాంతంలో నిర్మించిన కలెక్టరేట్ సముదాయ భవనం నుంచి చూస్తే పట్టణం ఇలా పచ్చందాల మధ్య కనువిందు చేస్తోంది. ఓ వైపు జిల్లా పాలనాధికారి భవనంలోని జాతీయ జెండా రెపరెపలు.. మరో వైపు విద్యుత్తు వెలుగుల గని 'కేటీపీఎస్' కర్మాగారం దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' ఛాయాగ్రాహకం క్లిక్ మనిపించింది.

– కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే



భౌబోయ్!

కొరవడిన పర్యవేక్షణ

పురపాలికలో కుక్కలను అనిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) కేంద్రానికి తరలించి శస్త్ర చికిత్స అనంతరం ఏ వార్డులో నుంచి తీసుకొచ్చారో అదే వార్డులో వదిలేయాల్సిన బాధ్యత సదరు గుత్తేదారులదే. ఇందుకోసం ఒక్కో కుక్కకు దాదాపు రూ.1,650 వరకు కేటాయిస్తున్నారు. పట్టుకోవడం, శస్త్ర చికిత్స, యాంటీ రేబిస్ వ్యాక్సిన్, తీసుకొచ్చిన కుక్కలను వదిలేయడం వంటి వాటికి కొత్తగూడెం పురపాలికలో ఏటా రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా ఆశించిన ఫలితం దక్కట్లేదు. పురపాలికలో ఉన్న శునకాలకు మాత్రమే కాకుండా ఇతర పంచాయతీలు, పొరుగు పురపాలికల్లోని కుక్కలకు సైతం శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఏబీసీ కేంద్రానికి తరలిస్తున్న వీధి కుక్కలు

శస్త్రచికిత్సల అనంతరం అదే వార్డుల్లో వదిలేసే ప్రక్రియకు మంగళం పాడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రోజూ 8 నుంచి 13 మంది వరకు కుక్కకాటుకు గురవుతున్నారంటూ వాపోతున్నారు. పర్యవేక్షణ కొరవడటంతోనే వాటి సంఖ్య పెరిగిపోతోందనే ఆరోపణలు వస్తున్నాయి.

కుక్కల సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారుల ఉదాసీనత ప్రజలకు శాపంగా మారుతోంది. కొత్తగూడెం పురపాలికలో ఏ వీధిలో చూసినా కుక్కలు భౌ భౌ అంటూ వెంటపడుతున్నాయని వాపోతున్నారు.

– కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

ప్రజల ఆందోళన

వార్డుల్లో ఉన్న శునకాలకు అదనంగా కొత్త గుంపులు చేరడంతో వీధుల్లో నడుచుకుంటూ వెళ్లలేని పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శస్త్రచికిత్స విధానంతో కొత్త సంతతిని నియంత్రిస్తున్నామని చెబుతున్నా.. వేరే చోట నుంచి వచ్చి చేరుతుండటంతో సమస్య మళ్లీ మొదటికే వస్తోందని ఆందోళన చెందుతున్నారు. కుక్కల సంచారం లేకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తులు చేస్తున్నారు. సంతతి నియంత్రణ మాత్రమే మా పరిధిలో ఉందంటూ అధికారులు చెబుతుండటంతో విచారం వ్యక్తం చేస్తున్నారు.

★ ఎక్కడి కుక్కలను అక్కడే వదిలేస్తున్నామని, ఇప్పటి వరకు 4,562 కుక్కలను గుర్తించామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీరభద్రాచారి 'న్యూస్‌టుడే'కి తెలిపారు. వాటిలో 75 శాతం శస్త్ర చికిత్సలు చేయించామని చెప్పారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ నూతన ఛైర్మన్‌గా రామ్మోహన్, కార్యదర్శిగా బండ శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఆదివారం ఏర్పాటైన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం 2026 సంవత్సరం వరకు కొనసాగనుంది.

మూగజీవిపై వ్యాపారి ప్రేమ



జంతువులను ఎంత ప్రేమగా చూసుకోవాలో చెప్పడానికి పట్టణానికి చెందిన ఓ స్టీల్ దుకాణ యజమాని నిదర్శనంగా నిలిచారు. ఉదయం దుకాణం తెరవగానే ఓ ఆవు రోజూ మెట్లెక్కి నేరుగా దుకాణంలోకి వచ్చేస్తుంది. ఆ యజమాని ప్రేమగా ఆవుకి పండ్లు, రొట్టెలు, చెనగలు, బెల్లం తదితర వంటివి తినిపిస్తారు. ఎటువెళ్లినా వచ్చి అదే దుకాణం ఎదుట కూర్చుండటంతో 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది. – కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే

రంగు రంగుల ఠాణా



సినిమాల్లో కనిపించిన మాదిరిగానే మండల ఠాణాను రంగరంగులతో ఆకట్టుకునేలా సుందరంగా ముస్తాబు చేశారు. ఇటీవల ఇక్కడ బాధ్యతలు చేపట్టిన సీఐ తాటిపాముల సురేశ్, ఎస్సై పోగుల సురేశ్ ఠాణాను పూర్తిగా మార్చారు. ఆవరణలో వాహనాలు నిలిపేందుకు షెడ్డు, ఠాణా ఎదురుగా ప్రయాణికులు నీడపట్టున ఉండేందుకు షెల్టర్, ఠాణా సూచిక లైటింగ్ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఇటీవల ఎస్పీ రోహిత్‌రాజ్ ఠాణాను సందర్శించి సీఐ, ఎస్సైలను అభినందించారు. – టేకులపల్లి, న్యూస్‌టుడే

అట్ల తద్దోయ్ ఆరట్లోయ్.. ముద్దపప్పోయ్ మూడట్లోయ్



తెలుగు సాంప్రదాయంలో పెళ్లీడు వచ్చిన యువతులు తమకు మంచి భర్త రావాలని, పెళ్లి చేసుకున్న ఆడపిల్లలు తమకు మంచి భర్త దొరికినందుకు తమ సౌభాగ్యం పది కాలాలపాటు వర్ధిల్లాలని ఎంతో నియమ నిష్ఠలతో తెలుగింటి ఆడబిడ్డలు నిర్వహించుకునే ప్రధాన పండగ అట్లతదియ(అట్లతద్దె). మండల కేంద్రంలోని గుడిపూడి సత్యనారాయణ, కృష్ణార్జునరావు స్వగృహాల్లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అట్లతద్దె పూజా కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఎనభై మంది ముత్తైదువులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పురాణగాథను పూజారి శ్రీరంగం అజయ్‌సాయి చక్రి వివరించారు. ఉయ్యాలలు ఊగే ఘట్టం ఉత్సాహంగా సాగింది. – టేకులపల్లి, న్యూస్‌టుడే

నేడు ప్రజావాణి

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో ఉండాలని ఆయన సూచించారు.

'ఐద్వా' రాష్ట్ర మహాసభలు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర మహాసభలు మూడు రోజులపాటు కొత్తగూడెంలో కొనసాగనున్నాయి. సోమవారం మొదటి రోజున బహిరంగ సభకు జాతీయ నాయకురాలు బృందాకారత్ హాజరుకానున్నారు. మంగళ, బుధవారం నాడు ప్రతినిధుల మహాసభ కొనసాగడంతో పాటు నూతన కమిటీ కూడా ఏర్పాటు కానుంది.

సమస్యల పరిష్కారానికే మహాసభలు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులను ప్రతిఘటించేందుకు కొత్తగూడెంలో ఈ నెల 23 వరకు నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా మండల కార్యదర్శి ఆలేటి సంధ్య తెలిపారు. ఇల్లెందులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో లక్ష్మి, కాంతమ్మ, పద్మ, వెంకటమ్మ, సుల్తానా పాల్గొన్నారు.

బేతంపూడిలో గ్యార్మీ వేడుకలు

టేకులపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని బేతంపూడి గ్రామంలో ఎంపీ షకీల్ ఇంట్లో ఆదివారం గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. గౌసుల్ ఆలం దస్తగిరికి ప్రతి ఏడాది ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఆయన సతీమణి లక్ష్మి దంపతులు, కాంగ్రెస్ జిల్లా నాయకులు కోరం సురేందర్, ఇల్లెందు పుర వైస్‌ఛైర్మన్ షేక్ జానీ హాజరయ్యారు.

పరుగులో సింధుకు స్వర్ణం

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: గుంటూరులో జరుగుతున్న సౌత్ జోనల్ జాతీయ స్థాయి పోటీల్లో కొత్తగూడేనికి చెందిన క్రీడాకారిణి మాలోతు సింధు 4×4 మిక్స్‌డ్ రిలేలో శనివారం జరిగిన పోటీల్లో స్వర్ణ పతకం సాధించినట్లు కోచ్ మాళోతు నరేశ్ ఆదివారం తెలిపారు.

జ్ఞాపకాలు పంచుకుని.. ఆనందంగా గడిపి



పాల్వంచ, న్యూస్‌టుడే: పట్టణంలోని బొల్లోరిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.

గిరిజన సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని పిలుపు

జూలూరుపాడు, న్యూస్‌టుడే: గిరిజన సంఘం వ్యవస్థాపక నాయకుడు గుగులోత్ ధర్మానాయక్ వర్ధంతి సందర్భంగా ఖమ్మంలో నవంబరు 5న నిర్వహించే సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు బానోత్ మధు, ఇస్రా కోరారు. మండలంలోని కొమ్ముగూడెంలో ఆదివారం సమ్మేళనం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జూలూరుపాడు మండల తొలి జడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికైన ఆయన గిరిజన సంఘం ఏర్పాటుకు బీజం వేశారని పేర్కొన్నారు. తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉద్యమించారని తెలిపారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించేలా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకునేందుకు సమ్మేళనంలో వివిధ ప్రాంతాల నుంచి నాయకులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో లకావత్ శ్రీను, రూప, బిచ్చు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న అఖిల్ అహ్మద్

ఇల్లెందు గ్రామీణం: కొమరారానికి చెందిన మంచ సత్యనారాయణ నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అతని భార్య సుగుణ హైదరాబాద్‌లో వస్త్రదుకాణంలో పని చేస్తూ ఇద్దరు కుమార్తెలను 10వ తరగతి చదివిస్తోంది. గ్రామానికి వచ్చిన వారి కుటుంబానికి పోచారానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు అఖిల్ అహ్మద్ ఆదివారం రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు. రమేశ్, శ్రీను పాల్గొన్నారు.

వైద్యురాలికి తక్షణమే న్యాయం చేయండి



నినాదాలు చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

పాల్వంచ, న్యూస్‌టుడే: కోల్‌కతాలో ఆగస్టులో చోటు చేసుకున్న ఘటనలో జూనియర్ వైద్యురాలికి తక్షణమే న్యాయం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పాల్వంచ పట్టణంలో ఆ సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. వైద్యురాలిపై అత్యాచార హింస, హత్య జరిగి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్ఫా రాజేశ్, శ్రీను, నరసింహారావు, భాస్కర్, కృష్ణ, మల్లేశ్, వెంకన్న, రమేశ్, గోపి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

సుజాతనగర్, న్యూస్‌టుడే: కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాఘవాపురం సీపీఎం గ్రామశాఖ మహాసభలో ఆదివారం పాల్గొని మాట్లాడారు. గ్యారంటీల పేరుతో అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, కమిటీల పేరుతో నిరుపేదలకు ఇళ్లు దక్కే పరిస్థితి కనిపించటం లేదని ఆరోపించారు. వీర్ల రమేశ్, కాట్రాల తిరుపతిరావు, గోవర్ధన్, నగేశ్, నాగరాజు, రాములు పాల్గొన్నారు.

'రైలు కూత'పై పాలకులు దృష్టి సారించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరేణి బొగ్గు గనులకు పుట్టినిల్లుగా శతాబ్దానికి పైగా బొగ్గు ఉత్పత్తి చేస్తున్నా ఇల్లెందు నుంచి గతంలో నడిచిన ప్యాసింజర్ రైలు పునరుద్ధరణను ప్రజాప్రతినిధులు విస్మరిస్తున్నారని సీపీఎం జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ ఆవేదన వ్యక్తం చేశారు. రైలు పునరద్ధరణ కోరుతూ ఇల్లెందు రైల్వేస్టేషన్ వద్ద ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

నాయకుల పరామర్శ

లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: టీయూడబ్ల్యూజే (టిజేఎఫ్ హెచ్-143) జిల్లా అధ్యక్షుడు కళ్లోజి శ్రీనివాస్ తల్లి జయమ్మ ఇటీవల మృతి చెందారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అల్లం నారాయణ, మారుతీ సాగర్ హేమచంద్రాపురంలో ఆదివారం ఆమె చిత్రపటానికి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాస్‌ను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. యోగి, రమణకుమార్, చంద్ర నర్సింహారావు, మహ్మద్ షఫీ, రవి పాల్గొన్నారు.



జయమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అల్లం నారాయణ, మారుతీ సాగర్



ఆలయంలో సుబ్బారావు, వెంకటేశ్వర్లు

ఘనంగా మహాచండీయాగం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు జేకే ఉపరితలగనిలోని దుర్గామాత ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన మహాచండీయాగం పూజలో జీఎం(కార్పొరేట్)సుబ్బారావు, ఎస్‌వోటూజీఎం వెంకటేశ్వర్లు, 12వ వార్డు కౌన్సిలర్ సిలివేరి అనిత సత్యనారాయణ పాల్గొన్నారు. పూజా కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూర్ణచందర్‌రావు, శివప్రసాద్ ఫిట్ సెక్రటరీ నవీన్ పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కవాతు

జూలూరుపాడు, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జూలూరుపాడులో ఆదివారం సాయంత్రం కవాతు నిర్వహించారు. ఖమ్మం విభాగ్ సంఘ్ చాలక్ కాటేపల్లి లక్ష్మీనారాయణ, విభాగ్ ప్రచార్ మధుజీ, జిల్లా ప్రచారక్ సుమన్, జిల్లా కార్యవాహ మేదరమెట్ల సార్థసారధి, శ్రీరామ్, జూలూరుపాడు మండల ఖండ కార్యవాహక్ శ్రీనాథరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: రేగళ్ల అటవీ ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అటవీశాఖ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. అటవీ ప్రాంతంలోని వాగు నుంచి కొందరు వ్యక్తులు అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్న సమాచారాన్ని తెలుసుకుని బీట్ అధికారి శంకర్ అక్కడకు చేరుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకుని కార్యాలయానికి తరలించారు. మరికొందరు తప్పించుకున్నారని, వారిని పట్టుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ములకపాడు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ఆదివారం తీవ్రంగా గాయపడ్డాడు. పాల్వంచ మండలం ఉల్వనూరు గ్రామానికి చెందిన పాయం నర్సింహారావు అనే వ్యక్తి ఆటో నడుపుతూ ములకపాడు గ్రామం వైపు వస్తున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడటంతో అతని తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కారు ఢీకొని మరొకరు..

చుంచుపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో వ్యక్తికి గాయాలైన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై రవి కుమార్ కథనం మేరకు.. సుజాతనగర్ మండలం గోపాతండాకు చెందిన మాళోత్ సురేశ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కొత్తగూడెం నుంచి తన ఇంటికి వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై వస్తూ శనివారం రాత్రి నందాతండా ప్రధాన రహదారి వద్ద యూటర్న్ తీసుకున్నారు. అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న కారు ద్విచక్రవాహన్ని ఢీకొనడంతో సురేశ్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని ఆసుపత్రికి తరలించారు. ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొన్న ఘటనలో..

చుంచుపల్లి, న్యూస్‌టుడే: ఆటోని లారీ ఢీకొనడంతో డ్రైవర్‌కు గాయాలైన ఘటన చోటు చేసుకొంది. ఎస్సై రవి కుమార్ కథనం మేరకు.. సుజాతనగర్ మండలం హరిలాల్ తండాకు చెందిన పన్నాలాల్ ఖమ్మం-కొత్తగూడెం ప్రధాన రహదారి మీదుగా ఆటోను నడుపుకొంటూ విద్యానగర్ బైపాస్ రహదారి వద్ద యూటర్న్ తీసుకొంటున్నారు. అదే మార్గంలో వస్తున్న లారీ వెనుక నుంచి ఆటోను ఢీకొనడంతో కింద పడగా అతనికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో మణుగూరు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్లే బస్సు సైతం ఆటోను స్వల్పంగా ఢీకొంది. పన్నాలాల్‌ను మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నిందితుల రిమాండ్

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందులో ఈ నెల 17న ఓ వ్యక్తిపై కొంతమంది దాడిచేయగా బాధితుడి ఫిర్యాదుతో ప్రత్యక్ష, పరోక్షంగా ఘటనకు కారకులుగా ఏడుగురిపై కేసు నమోదైన విషయం విదితమే. ముగ్గురు నిందితులను రెడ్డిబోయిన వంశీకృష్ణ, మూచకుర్తి ప్రేమ్‌కుమార్, ఎడారి ఉదయ్‌కుమార్‌లను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. దాడికి వాడిన ఇనుప రాడ్, సీసాలను సీజ్ చేసినట్లు డీఎస్పీ చంద్రభాను తెలిపారు. పరారీలో ఉన్న వారిని త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ వివరించారు.

ఇల్లు చూడు.. పచ్చందం చూడు!!



అక్టోబరు 2 వరకు 'స్వచ్ఛతా హీ సేవ'లో భాగంగా గ్రామాల్లో స్వచ్ఛత, పచ్చదనం పెంపుపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సమయంలో పంచాయతీల్లో సిబ్బంది కాలనీల సుందరీకరణ దిశగా స్థానికులను ప్రోత్సహించారు. సుజాతనగర్‌లోని బాలాజీనగర్‌ను ఉత్తమ కాలనీగా గుర్తించి స్థానికులకు స్వచ్ఛ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. నివాసాల ఎదుట పూల కుండీలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయించారు. వాటిల్లో పూలు, ఔషధ మొక్కల పెంపకం చేపట్టేలా చూశారు. ఇటీవల జడ్పీ సీఈఓ చంద్రశేఖర్ కాలనీని సందర్శించి స్థానికుల స్వచ్ఛ స్ఫూర్తిని, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

– సుజాతనగర్, న్యూస్‌టుడే

ఆత్మవిశ్వాసంతో ముందడుగు..
వ్యాపారంలో రాణింపు

మహిళలను ప్రోత్సహిస్తే ఆకాశమే హద్దు అన్నట్లు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఆసక్తి ఉన్న రంగంలో రాణిస్తూ కుటుంబానికి దన్నుగా నిలుస్తున్నారు. లక్ష్మీదేవిపల్లిలో మిల్క్ పార్లర్ నిర్వహిస్తూ ఆర్థిక స్వావలంబన సాధించిన విజయలక్ష్మి ఇటీవల కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ నుంచి ప్రశంసలందుకున్నారు. ఆమె విజయ ప్రస్థానంపై కథనం.

– లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే



పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న దుంపటి విజయలక్ష్మి

వ్యాపారాన్ని విస్తరిస్తూ..

లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో దుంపటి విజయలక్ష్మి 9 నెలల క్రితం చిన్నగా పాల పార్లర్ వ్యాపారాన్ని ప్రారంభించారు. మరింతగా విస్తరించాలనే లక్ష్యంతో స్వయం సహాయ సంఘం సభ్యురాలైన ఆమె రెండు నెలల క్రితం బ్యాంకు రుణం రూ.6 లక్షలు పొందారు. ఓ కంపెనీ ఫ్రాంఛైజీ పొంది వాటి ఉత్పత్తులను విక్రయిస్తూ మరింతగా రాణిస్తోంది. వీటి నిర్వహణలో కుమార్తె మౌనిక, భర్త ముత్తారావు సహకరిస్తున్నారు. సీజన్‌లో ఆయా ఉత్పత్తులు విక్రయిస్తూ రూ.10 వేలు, అన్ సీజన్‌లో రోజుకు రూ.5 వేల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాను 2015 నుంచి స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాలిగా ఉంటూ మొదట రూ.35 వేల రుణం పొందానని, క్రమంగా బ్యాంకర్లు తన వ్యాపారానికి రూ.లక్షల్లో రుణాలు మంజూరు చేశారన్నారు. ఐస్‌క్రీమ్స్, బిస్కెట్స్, మిల్క్ ప్రొడక్ట్ కాకుండా శాండ్ విచ్, పిస్తా, మ్యాగీస్, తదితరాలు విక్రయించడంతో కొంత ఆర్థికంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి పక్కనే ఉన్న గదిలో 'గ్రిల్ నైట్స్' పేరుతో 15 రకాల షెవర్మాలు అందించేలా వ్యాపారాన్ని సిద్ధం చేశామని చెప్పారు.

అనుభవం లేకపోయినా ఆత్మవిశ్వాసంతో పాల పార్లర్ నడుపుకొంటూ ముందుకు సాగుతున్నా. మా పార్లర్‌ను కలెక్టర్ సందర్శించి అభినందించటం సంతోషంగా ఉంది. కలెక్టర్ సూచనలతో వివిధ రకాల బ్రాండింగ్ ఉత్పత్తులను విక్రయిస్తూ వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటున్నాం.

- **విజయలక్ష్మి**